రేగ పుణ్యగిరి గిరిజనుల సమస్యలపై ఎమ్మెల్యేకి వినతిపత్రం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్ : మంగళవారం ఉదయం రేగ పుణ్యగిరి గిరిజనులు జనసెన నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు, టీడీపీ నాయకులు సాయిరాం ఆధ్వర్యములో ఎంఎల్ఏ కోళ్ల లలిత కుమారిని తమ నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు .పుణ్యగిరి శివాలయము నుండి తమ రేగపుణ్యగిరి గిరిజన గ్రామానికి. 3 కిలోమీటర్ల రోడ్ నిర్మానము చేయుటకు అంచనా విలువ (ఎస్టిమేషన్) వేయించి శాంక్షన్ చేయించి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.తమకు పోడు పట్టాలు ఇప్పించాలని, హౌసింగ్ స్కీములు మంజూరు చేయాలని ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఎంఎల్ఏ లలితకుమారి కి వినతి పత్రాన్ని, జనసేన నాయకులు సన్యాసి నాయుడుతో కలసి గిరిజనులు ఇచ్చారు.

ఇదేం పని గురువర్యా..?

-ఆరో తరగతి విద్యార్థినిపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు
- విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు
- నెల్లిమర్ల మండలం కొండవెలగాడ పాఠశాలలో ఘటన

నెల్లిమర్ల / విజయనగరం : విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించాడు. ఆరో తరగతి చదువుతున్న ఓ చిన్నారినిని తాకకూడని చోట తాకుతూ పైశాచికానందం పొందాడు. తాను చేసిన పని బయటపెట్టొద్దని బెదిరించాడు. ఉపాధ్యాయుడి చేష్టల్ని సదరు విద్యార్థిని తన తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటపడింది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో సదరు ఉపాధ్యాయుడిపై నెల్లిమర్ల పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన నెల్లిమర్ల మండలం కొండవెలగాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం నెల్లిమర్ల మండలం కొండవెలగాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై అదే పాఠశాలలో పనిచేస్తున్న బయాలజీ ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మద్యం మత్తులో పాఠశాలకు విచ్చేసిన ఉపాధ్యాయుడు విద్యార్థినిని తాకకూడని ప్రదేశాల్లో తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో సదరు విద్యార్థిని గత మూడు రోజులుగా ముభావంగా ఉంటూ, తిండి తినడం మానేసింది. తల్లిదండ్రులు గుచ్చి గుచ్చి ప్రశ్నించగా విషయం బాలిక బయటపెట్టింది. ఉపాధ్యాయుడు తనను ఇబ్బందిపెట్టిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. విషయం బయటపెట్టవద్దని సదరు ఉపాధ్యాయుడు తనను భయపెట్టినట్లు వెల్లడించింది. దీంతో తల్లిదండ్రులు మంగళవారం నెల్లిమర్ల పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందుతుడ్ని అరెస్టు చేశారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి
రూ.30 లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

విశాలాంధ్ర - మెంటాడ : గ్రామాల అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్త్రీ శిశు సంక్షేమ గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలో మంగళవారం పిట్టాడ, గుర్ల తమ్మిరాజుపేట గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామంలోని మౌలిక వసతులు కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రోడ్లు కాలువలు వంతెనల సమస్యలు లేని గ్రామాలే అభివృద్ధి చెందుతాయని గ్రామ పంచాయితీలలో సర్పంచ్ లకు పూర్తి అధికారం కట్టపెట్టడం చేతన అభివృద్ధికి బాధ్యులను చేసిన వారిమీ అవుతామని కూటమి ప్రభుత్వం తలంచినట్లు తెలిపారు. మండలంలోని పిట్టాడ ఆర్ అండ్ బి నుండి పైడితల్లి అమ్మవారి గుడి వరకు బీటీ రోడ్డు 15 లక్షలు గుర్లతమ్మిరాజుపేట సచివాలయ మనకు అనుకుని ఉన్న రోడ్డుకు 15 లక్షలు మొత్తం 30 లక్షల రూపాయల నిధులతో బీటీ రోడ్లు కు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం 21. 80 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. అభివృద్ధితో పాటు ఎన్నికలలో ఇచ్చిన హామీలను దసలవారీగా నెరవేరుస్తామన్నారు. మహిళలకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మొదటి దప పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని రెండవ దప నిధులను గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇవ్వడం జరుగుతుందని విత్తనాలు ఎరువులు ప్రజలకు అందుబాటులోనే ఉండేలాగున రైతు సేవా కేంద్రలలో సిద్ధంగా ఉంచడం జరుగుతుందని, ఆగూరు బ్రిడ్జి నిర్మించడానికి తగు చర్యలు చేపట్టి శుభవార్త తెలియచేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, గొర్లె ముసలి నాయుడు, గెద్ద అన్నవరం, జిటిపేట సర్పంచ్ చౌక్కాకు పైడి రాజు చౌక్కాకు, సన్యాసినాయుడు, ఎంపీటీసీలు రెడ్డి ఎర్నాయుడు సిద్దల లక్ష్మి, గ్రామ సర్పంచులు, కూటమి పార్టీల నాయకులు, ఎంపీడీవో భానుమూర్తి, తాసిల్దార్ కోరాడ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ దేవిడ్రాజు, పంచాయితీరాజ్ డిఈ, వివిధ శాఖల అధికారులు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసయా రమణ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - చీపురుపల్లి : ఆశయ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా చీపురుపల్లి పట్టణానికి చెందిన రెడ్డి రమణ చీపురుపల్లితో పాటు జిల్లాలో పలు ప్రాంతాల్లో చేసిన సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని మండలంలోని మెట్టపల్లి గ్రామానికి చెందిన పలువురు సామాజిక వాదులు అభిప్రాయపడ్డారు. మంగళవారం నాడు మెట్టపల్లిలోని నవభారత్ యువజన సేవా సంఘం గ్రామ పెద్దలు సంయుక్తంగా రెడ్డి రమణ మృతి పట్ల సంతాప సభ నిర్వహించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రెడ్డి రమణ ఆకస్మిక మరణం సమాజ సేవకులకు ఎంతగానో దెబ్బాంతిని కల్పించిందన్నారు. అతి చిన్న వయసులోనే గత 19 ఏళ్లగా సామాజిక సేవలు అందజేస్తూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ, అనాధ మృతదేహాలకు సైతం అంత్యక్రియలు జరిపిన రెడ్డి రమణ నేటి యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా రెడ్డి రమణ చిత్రపటం వద్ద విద్యార్థులు గ్రామస్తులు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి : పురపాలక సంఘ పరిధిలో మహిళా పొదుపు సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను అర్బన్ మార్కెట్ ద్వారా ప్రదర్శన మరియు అమ్మకాల స్టాల్ ను మంగళవారం ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) ప్రారంభించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని నివసిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను ఇంటి వద్ద తక్కువ పెట్టుబడితో మంచి వస్తువులు నాణ్యతగా తయారు చేస్తారని, తద్వారా మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందడానికి ఈ కార్యక్రమం ఎంతో ఆసరాగా నిలుస్తుందని అన్నారు. ఈ ఉత్పత్తులను ఆన్లైన్ ద్వారా కూడా విక్రయించే విధంగా ఏర్పాటు చేయాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కూటమి ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ రావు, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు .

వి. జాహ్నవిని అభినందించిన మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : జిల్లాలోని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర బ్యాడ్మింటన్ క్రీడల్లో విజేతగా నిలిచిన ఇంటర్మీడియట్ విద్యార్థి జాహ్నవి అండర్ 19 జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ,రాష్ట్రస్థాయికు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాసును కలిశారు. వి.జాహ్నవి ని మంత్రి అభినందించారు. బాగా ఆడి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలో ముక్కాం గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం నమోదు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. ఈ సందర్బంగా బంగార్రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మంగళవారం నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టనున్నట్లు చెప్పారు.శాశ్వత సభ్యత్వం లక్ష రూపాయలు,సాధారణ సభ్యత్వ నమోదుకు 100 రూపాయలు రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు విద్యా వైద్యం ఉపాధి అవకాశాలు కల్పించడంలో పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గనగల్ల బాబాజీ ,టీడీపీ నాయకులు బడి నాయుడు, గరికిన రాము,అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గుంతల లేని రహదారిగా తీర్చిదిద్దేందుకు కృషి

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశానుసారం నగరాన్ని గుంతల రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని విజయ నగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమినిటీస్ కార్యదర్శులు, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ముందుగా నగరంలో ఉన్న గుంతల గుర్తింపు సర్వేను చేపట్టామన్నారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు అనేక ప్రాంతాలలోని రహదారులలో గుంతలు ఏర్పడినట్లు గుర్తించామన్నారు. అన్ని ప్రాంతాలలో ఇప్పటివరకు 1,655 గుంతలు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు గుంతలు పూడ్చేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా గుంతలలో సీసీ మరియు బిటి మెటీరియల్‌తో మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఇందుకోసం అవసరమైన అంచనాలను రూపొందించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఇప్పటికే ఆదేశించగా సుమారుగా 58 లక్షల రూపాయలు గుంతలు పూడ్చేందుకు అంచనా వ్యయంగా ప్రతిపాదించారని తెలిపారు. ప్రతిపాదిత అంశాలు పరిపాలన ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలిచి డిసెంబర్ 15 లోగా గుంతలను పూడ్చివేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.త్వరలోనే గుంతలను పూడ్చి ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రహదారులను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

దీపావళి మందు గుండు షాపులపై కేసులు నమోదు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : విజయనగరం పట్టణం కే.యల్ పురం సమీపంలో మరియు జామి మండలం జడ్డేటివలస గ్రామం నందు ఉన్న పలు మందు గుండు షాపులపై లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించి 7 షాపులపై మరియు 5 కంపెనీలపై కేసులు నమోదు చేసి కొంతమేర స్టాక్ సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో తయారీ తేదీ లు లేకపోవుట, విక్రయ ధర లేకపోవుట, ధరలు మూసి ప్రత్యేక స్టికర్ అంటించుట, కంపెనీ చిరునామా లు లేనట్లు ఇన్స్పెక్టర్ యం.దామోదర నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా వినియోగదారులతో కూడా మాట్లాడి తూకం లో గానీ, కొలతలో గానీ లేదా ఎవరైనా వ్యాపారస్తులు మోసం చేసినా, ఏవైనా ప్యాకేజిలపై ముద్రించిన ధర కంటే అధికంగా విక్రయించినయెడల తమ శాఖకు తెలుపవచ్చని, ఫిర్యాదు దారు వివరములు గోప్యముగా ఉంచబడునని తెలియజేశారు.

పంచాయతీ నిధులు పక్కదారి పట్టించొద్దు

విశాలాంధ్ర - గుర్ల : పంచాయతీ నిధులు పక్కదారి పట్టించొద్దని మండలంలో గల వైసీపీ ప్రజాప్రతినిధులు మండల అధికారులు మంగళవారం వినతపత్రాలు అందజేశారు ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, జడ్పిటిసి అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం ప్రభుత్వ జీవోలను లోబడి అన్ని గ్రామ పంచాయతీలుకు ముంజూరు కాబడిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా ప్రతిపాదించబడిన ప్రతి పనులు కార్యరూపం దాల్చుటకు గ్రామ సభలు తీర్మానాలను అనుసరించి అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానం సిఫార్స్ లేకుండా ఇతరులతో పనులు చేపట్టి గ్రామపంచాయతీల నిధులు పక్కదారి పట్టించొద్దని మండల పరిపాలన అధికారి వరప్రసాద్, మండల పంచాయతీ విస్తరణ అధికారి అన్నపూర్ణదేవి వినతిపత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైకాపా మండల పార్టీ అధ్యక్షులు జమ్ము స్వామినాయుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం స్వానిధి అందుకున్న నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : పీఎం స్వానిధి పథకం అమలులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజయనగరం నగరపాలక సంస్థకు రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పి. నారాయణ అవార్డును ప్రధానం చేశారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పి. నారాయణ కమీషనర్ పి. నల్లనయ్య ను ప్రత్యేకంగా అభినందించారు. జాయింట్ సెక్రెటరీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మరియు మిషన్ డైరెక్టర్ డే ఎన్ యు ఎల్ ఎమ్ న్యూఢిల్లీ వారు ఎంపిక చేసిన పీఎం స్వనిధి పథకం అమలులో ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య మాట్లాడుతూ పి ఎం స్వనిధి పథకం అమలులో విజయనగరం నగరపాలక సంస్థకు అవార్డు రావడం సిబ్బంది సమిష్టి కృషి అని అన్నారు. ఇదే ఒరవడితో మరింత కష్టపడి మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని ఆకాంక్షను వెలుబుచ్చారు.

నైపుణ్య గణనకు సిద్ధం కావాలి : జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం : నైపుణ్య గణన - 2024 నిర్వహించేందుకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ ఆదేశించారు. స్కిల్ సర్వే నిర్వహణకు మండలాల నుంచి ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్లకు స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనుందని తెలిపారు. త్వరలో నిర్వహించబోయే ఈ గణనకు అన్నివిధాలా సంసిద్ధులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఈ సర్వే జరుగుతుందన్నారు. నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని, ఇంటింటికీ సర్వే కోసం వెళ్ళినప్పుడు ఈ గణన అవసరాన్ని యువతకు వివరించి, వారి దగ్గర నుంచి వివరాలను సేకరించాలని సూచించారు. దీనికి సంబంధించిన యాప్ లో అప్లోడ్ చేయాల్సిన అంశాలపై సందేహాలను నివృత్తి చేశారు. కచ్చితంగా, సంపూర్ణమైన వివరాలతో గణనను పూర్తి చేయాలని జెసి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి జి.ప్రశాంత్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి, డి.అరుణ, రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్ పృద్వి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా బాధ్యులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపికలు నిర్వహించిన వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : జిల్లాలో సివిల్ సర్వీస్ ఉద్యోగుల పురుషులు, మహిళలు క్రీడాకారుల ఎంపికలు మంగళవారం రాజీవ్ మైదానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా క్రీడా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా అధికార సంస్థ, కలెక్టర్ అండ్ చైర్మన్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలతో విజయనగరం జిల్లాలో ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగుల పురుషులు మరియు మహిళలు క్రీడాకారులు అథ్లెటిక్, బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, చెస్, క్రికెట్, ఫుట్బాల్, కోకో, కబడ్డీ, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, సైక్లింగ్ ,స్విమ్మింగ్ క్యారమ్స్, బెస్ట్ ఫిజిక్స్, పవర్ లిఫ్టింగ్, క్రీడల్లో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించామని ఆయన అన్నారు. ఈ క్రీడల్లో ఎంపికైన వారు నవంబర్ 6 నుండి నుండి అదే నెల 9వరకు జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపబడునని అలాగే రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయికి పంపబడునని ఆయన అన్నారు.

మజ్జి శంకర్రావుకి 3 రజత పతకాలు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : విజయనగరం పుచ్చల విధికి చెందిన మజ్జి శంకర్రావు రైటైర్డ్ ఏ అర్ హెచ్ సి మాస్టర్స్ అథ్లెటిక్స్ లో మూడు రజత పతకాలు సాధించారు. ఇటీవల విశాఖ పట్నం కమిషనరేట్ గ్రౌండ్ లో జరిగిన 5 కే ఎం వాక్, హేమర్ త్రో, షాట్ పుట్ విభా గాల్లో పతకాలు సాధించారు. కోడి రామ్మూర్తి జిమ్‌లో పలువురు శంకరరావుని అభినందించారు.

ఏపంటీజెడ్‌ను సందర్శించిన సీతం విద్యార్థులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధి లో ఉన్న ప్రముఖ సీతం విద్యాసంస్థలో మూడో సంవత్సరం చదువుతున్న మెకానికల్ విద్యార్థులు కు పారిశ్రామిక సందర్శ నంలో భాగంగా ప్రముఖ ఆంధ్రప్రదేశ్ మెడికో టెక్నాలజీ హబ్ (ఏపంటీజెడ్) విశాఖపట్నం ను సందర్శించారు.మొదట సెషన్ పరిశ్రమ లు ఎలా ఏర్పడ్డాయి వాటి ప్రాముఖ్యతను ఇన్నోవేషన్ సెమినార్ హాల్ లో ఇంటరాక్షన్ జరిగింది.కంపెనీ ఉద్యోగులు విద్యార్థులకు అనేక అవకాశాల గూర్చి మరియు ట్రెనింగ్ శిక్షణ పద్ధతులు కోసం ప్రెజెంటేషన్ పద్ధతిలో వివరించారు. ప్రోసేతిటిక్ లింబ్స్ సెంటర్ మరియు పరికరాల పనితీరు నీ ట్రైనర్ రాహుల్ వివరించారు.అలాగే నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ ఇన్ అడ్వాన్స్ మెడికల్ టెక్నాలజీ (ఎన్ఐఎఎంఎటీ) లో ట్రైనర్ గౌరవ్ త్రీ డి ప్రింటింగ్, మెడికల్ పరికరాలు తయారీ విధానాన్ని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఈ అవకాశం కల్పించిన సీతం యాజమాన్యం కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సహాయం గా మెకానికల్ విభాగ ఉపాధ్యాయులు డీ.చైతన్య ,సిహెచ్ తేజస్వి, టీ.నరేంద్ర గోపి పాల్గొన్నారు.

ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటిఫైడ్ బుక్స్ అందజేత



విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరం లో స్థానిక బ్రాంచ్ లైబ్రరీకి సోమవారం ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించి నోటిఫైడ్ పుస్తకాలను స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి స్వప్న కు ధీర ఫౌండేషన్ వారు అందజేశారు.

పైడితల్లి అమ్మవారికి బంగారు ముక్కు పుడక బహుకరణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మ వారికి దాంతో బివిఎస్ఎన్ ఆర్. సుబ్ర హ్మణ్యం 4.551 అమెరికన్ డిమాండ్స్‌తో బంగారు ముక్కు పుడక ఆభరణం గా బహుకరించారు. గతంలో శ్రీ పైడితల్లి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారిగా పని చేసిన సుబ్ర హ్మణ్యం అందజేసిన ఈ కానుకను శ్రీ పైడి తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు జరు గుతున్న నేపధ్యంలో మంగళవారం దేవ స్థానం ఇఓ. డివివి ప్రసాదరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు అమ్మవారికి అలంకరణ చేశారు.

బాణాసంచే కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

విశాలాంధ్ర - గుర్ల : బాణా సంచే కాల్చేట ప్పుడు ప్రజలు తీసు కోవాల్సిన జాగ్రత్తలు పై పూ ర్తిగా అవగాహన ఉండాలని ఎస్సై నారాయణరావు తెలిపారు మంగళవారం ఆయన మాట్లాడుతూ ముందుగుండు సామగ్రి చేటప్పుడు జాగ్రత్త తీసుకోవాలని అన్నారు చిన్నపిల్లలు వృద్ధులు ఉండే చోట పెద్ద శబ్దాలు వచ్చే కాకర్స్ కాల్చుద్దన్నారు. వాహనాలపై కాకర్స్ తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్త తీసుకోవాలన్నారు.

ప్రజలకు చేరువగా సేవలందించిన వాలంటీర్లను గుర్తించండి

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకి చేరేలా శ్రమించిన వాలంటీర్లను గుర్తించి ఉద్యోగంలో కొనసాగించాలని విజయ నగరం జిల్లా, గ్రామ వార్డు సచివాలయ సెక్రటరీలకు, అడ్మిన్లకు ఆవేదనతో వాలంటీర్లు వినతులు అందజేశారు. వాలంటీర్లుకి ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని విజయన గరంలో ఎ.పి గ్రామ, వార్డు సచివాలయ వాలం టీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) అధర్యంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో యూనియన్ నిర్ణయం మేరకు మూడు రోజులు పాటు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల సెక్రటరీలకు, అడ్మిన్లకు వినతిపత్రాలు అందజేసే కార్యక్రమం చేపట్టడం జరిగిందని యూనియన్ జిల్లా కన్వీనర్ ఏ.రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ ముందుగా యూనియన్ ఇచ్చిన పిలుపును గౌరవించి వినతిపత్రాల పోరాట కార్యక్రమంలో పాల్గున్న ప్రతీ ఒక్కరికీ పేరు పేరున ఏఐటీయూసీ తరపున విప్లవాభినందనలు తెలిపారు. 2019 లో సచివాలయ వ్యవస్థ కంటే ముందుగానే వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతి యువకులను వాలంటీర్లుగా నియమించి వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరవేడయంలో ప్రభు త్వానికి ప్రజలకు మధ్య వారదిగా సేవలు అందించడం జరిగిందని ఇది అందరికీ తెలిసిన విషయ మన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే వాలంటీర్లను కొనసాగిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు చేయకపోవడం వలన వాల ంటీర్లు ఆవేదన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో 2 లక్షల అరవై వేల మంది వాలంటీర్లు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే వాలంటీర్లకు న్యాయం చేస్తారని ఎన్నో ఆశలు పెట్టుకుని రాజకీయ ఒత్తిళ్ళకి గురి చేసిన కూటమి ప్రభుత్వం గెలుపుకోసం వారి వంతుగా కృషి చేసారని, వాలంటీర్ల ఆశల్లో నీళ్ళు చల్లకుండ వారి ఆవేదన అర్థం చేసుకుని ఉద్యోగాల్లో కొనసా గించాలన్నారు. 5 నెలలుగా ప్రభుత్వం నుండి గౌరవ వేతనం కూడా చెల్లించకపోతే ఎందరో మహిళలు ఆ గౌరవ వేతనం మీదే కుటుంబంలో కొంత ఆర్థక ఇబ్బందులను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో అటెండెన్స్ కూడా వేసుకొనే అవకాశం కల్పించడం లేదనీ అన్నారు. ఎన్నికలకు ముందు వాలంటీర్స్ అందరికి న్యాయం చేస్తామని నెలకు పదివేల రూపాయలు గౌరవ వేతనం పెంచి ఇస్తామని వాలంటీర్లు అందరికి సమాజంలో మంచి గుర్తింపు గౌరవం వుండే పద్ధతిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆ హామీ మరిచిపోవద్దు అని గుర్తు చేశారు. గౌరవ వేతనం పదివేల రూపాయలు ఇప్పించాలని, గత నాలుగు నెలలుగా బకాయి ఉన్న గౌరవ వేతనాన్ని విడుదల చేయించాలని, రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వాలంటీర్లను తిరిగి విదుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వానికి సేవ చేయాలి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో వాలంటీర్ ఉద్యోగాల్లో చేరిన వాలంటీర్ అందరి భవిష్యత్తుకు భరోసా కల్పించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఈ కార్య క్రమంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, రూరల్‌లో వార్డు, గ్రామ సచివాలయల నుంచి జిల్లాలో మండలాల నుంచి వాలంటీర్లు జిల్లా కన్వీనర్ అల్లాడ రవీంద్ర, కో కన్వీనర్లు అచ్యుత కుమారి మోహన్ ఆదిత్య మణికంత, బాలు దేవి బొండపల్లి నుండి అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు సౌకర్యం కల్పించండి

విశాలాంధ్ర - లక్కవరపుకోట : నియోజకవర్గంలోని శృంగవరపుకోట మండలం రేగ పుణ్యగిరి గిరిజన గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని రేగ పుణ్యగిరి గిరిజనులు మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం లేక మండల కేంద్రానికి రాకపోకలు సాగించడానికి అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లడానికి, చదువుకునే విద్యార్థులు పాఠశాలకు వెళ్ల డానికి నాన్న ఇబ్బందులు వర్షాకాల సమయంలో పడుతున్నామని, గ్రామంలో చాలామంది సొంత గృహాలు లేక ఇబ్బం దులు పడుతున్నామని గృహ నిర్మాణ శాఖ నుంచి గృహాలు నిర్మించుకొనుటకు నిధులు మంజూరు కు కృషి చేస్తారని ఎమ్మెల్యే కి వినతిపత్రం ఇచ్చారు. రోడ్డు సౌకర్యం నిర్మాణానికి నిధులు మంజూరయ్యే విధంగా, నూతన గృహ నిర్మాణాలు అయ్యే విధంగా భరోసా ఇచ్చారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేద్దాం

ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు (సతీష్)

విశాలాంధ్ర - వేపాడ : వేపాడ మండల ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం అన్ని విధాల అభివృద్ధి చెందే విధంగా కృషి చేద్దామని మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు అన్నారు. మండల కేంద్రం వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం చైర్మన్ దొగ్గ సత్యవంతుడు ఆధ్వర్యంలో మంగళ వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపడతామని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సౌకర్యాలతో పాటు వైద్యం అదే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతుందని వైద్యాధికారి ఒకరే ఉండడం వల్ల రోగులకు వైద్యం అందించేందుకు కష్టమవుతుందని సిహెచ్ఓ ఆంజనేయులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లి వైద్యాధికారిని నియమించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోనాపతి అప్పలనాయుడు, హాస్పిటల్ కమిటీ సభ్యులు తహసిల్దార్ రాములమ్మ, వైసిపి నాయకులు రుద్ర వెంకట్రావు, బోజంకి శ్రీను, వైద్యాధికారిని, ఏ. ధరణి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెంట్ మహేష్ తదితర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల నియామకం చేయాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పి. శంకరరావు కోరారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కమిషనర్ ఎల్. రామలక్ష్మికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జనాభా పెరుగుతున్న పారిశుద్ధ్య కార్మికులను పెంచక పోవడంతో పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను పెంచాలని, పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని, భద్రతా సౌకర్యాలు మెరుగుపరచాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్ ఆధారంగా విభజించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్, సబ్బులు, కొబ్బరి నూనె, గ్లౌజులు ఇవ్వాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేస్తామన్నారు. కార్య క్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు యుగంధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

సివిల్ సప్లై డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రేషన్ డీలర్లు

విశాలాంధ్ర - మెరకముడిదాం : మెరకముడిదాం మండల రేషన్ డీలర్ల సంఘం మంగళవారం నాడు చీపురుపల్లిలో సివిల్ సప్లై డైరెక్టర్ గద్దె బాబురావు ను కలసి అభినందించారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘంకు ఉన్న సమస్యలు తెలిపారు. బైపర కిసాన్, డీలర్ల ఇన్సూరెన్స్ అలాగే భైరిపురంలో ఉన్న మార్కెట్ యార్డ్ నుంచి రేషన్ బియ్యం నేరుగా డిపోలుకు పంపిణీ చేయాలని రేషన్ డీలర్ సంఘాలకు రావలసిన కమిషన్ ఇప్పించాలని ఆయన్ని కోరారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డైరెక్టర్ గద్దె బాబురావు వీలైనంతవరకు మీ సమస్యలు పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జ డీలర్లసంఘం జిల్లా అధ్యక్షులు బుగత వెంకటేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు సముద్రపు రామారావు, బొబ్బిలి డివిజన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ జిల్లా డివిజినల్ ఉపాధ్యక్షులు కే శ్రీనివాసరావు, అధ్యక్షులు జనార్ధన్, చీపురుపల్లి డీలర్ల సంఘం అధ్యక్షులు గోపాల్ మెరకముడిదాం డీలర్ సంఘం అధ్యక్షులు సుంకర జై సింహా నాయుడు మెరకముడిదాం చీపురుపల్లి గరివిడి డీలర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కెరియర్ అవకాశాలుపై సత్య కళాశాలలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక సత్య డిగ్రీ పిజి కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఐ.టి బిజినెస్ ప్రాసెస్ మేనేజ్మెంట్ (బి.పి.ఎమ్) పై పారిశ్రామిక ఉద్యోగ అవకాశాల పై అవగాహన సదస్సు జరిగింది. ఆర్.ఎల్ నారాయణ (డబ్ల్యూ.ఎన్.ఎస్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ అండ్ లోకేషన్ హేడ్ హైద్రాబాద్) మాట్లాడుతూ ప్రొఫ్ఫెస్నెల్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ గురించి వివరించారు. ఆల్ఫా న్యూమరిక్ స్కిల్స్, కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్స్ వీటి పై విద్యార్థులు నైపుణ్యం కలిగించుకోవాలని ఉద్యోగ అవకాశాలు సాధించుకోవాలని తెలియజేశారు. ఎమ్.ర్.బి. ప్రవీణ్ కుమార్ (నాస్కామ్- రీజినల్ లీడ్ అకడమిక్ అండ్ గవర్మెంట్స్ రిలేషన్స్) మాట్లాడుతు ఉచి తంగానే ఆన్లైన్ లో విద్యార్థులు ఫ్రీ సర్టిఫికేషన్ కోర్స్ మరియు వాటి పై ఉన్న అవకాశాలను గురించి చెప్పారు. ఆ కోర్స్‌లకు ఎలా నమోదు చేసుకోవాలి .చేసుకున్న తర్వాత ఏ విధంగా కోర్స్ లో సర్టిఫికెట్ పొందవచ్చు తర్వాత వాటి పై ఉన్న ఉద్యోగ అవకాశాలను ఎలా అందిపుచుకోవచ్చు అనే విషయాన్ని గురించి క్లుప్తంగా విద్యార్థులకు తెలియజేశారు. రామ్ నారాయణ్ చౌరస (ఎ.వి.పి - టాలెంట్ అక్విసైషన్ గ్లోబల్ సెర్విస్ ప్రైవేట్ లిమిటెడ్ విద్యార్థులను ఉద్దేశిస్తూ పలు కంపెనీలలో అవకాశాలను విద్యార్థులు ఏ విధంగా చేయాజర్చు కుంటున్నారు అనే విషయం తెలియజేశారు. ప్రతిరోజూ సుమారు ప్రతి కంపెనీ కి 150 నుండి 200 మంది కెడీట్లు ఇంటర్వ్యూ కి హాజరుకగా అందులో 5 నుండి 10 మంది మాత్రమే అవకాశాలను పొందుతున్నారన్నారు. వారిలో కమ్యూనికేషన్ స్కిల్స్ అనేవి తగ్గడం వలన వాళ్ళు అందుకోలేకపోతున్నారని వాటి గురించి విద్యార్థులు వారిలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం వలన అవకాశాలను పొందవచ్చు అన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం శశి భూషణ్ రావ్ పాల్గొని వారు ఎపిఎస్ఎస్ డిసి ఆధ్వర్యం లో ఉన్న నాస్కం టాలెంట్ కనెక్ట్ వారితో ఎమ్. ఒ. యు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు (వైస్ ప్రిన్సపల్ ఎన్ సి సి కెప్టెన్ ఎమ్. సత్యవేణి, ఎన్ సి సి ఆఫీసర్, మరియు ప్లేస్ మెంట్ ఆఫీసర్ ఎల్ టి ఎమ్. ఉదయ్ కిరణ్ , ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి.సూర్యనాయుడు , అధ్యపక్షులు, విద్యార్దులు పాల్గొన్నారు.

18 ఏళ్ళు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలి

గుర్తింపు పొందిన రాజకీయ పక్షాలు బి.ఎల్.ఏలను నియమించాలి

రాజకీయ ప్రతినిధుల సమావేశం లో డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి

విశాలాంధ్ర - విజయనగరం : జనవరి 2025 నాటికి 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని డి.ఆర్.ఓ ఎస్. శ్రీనివాస మూర్తి తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 29 న డ్రాఫ్ట్ ఎలెక్టోరల్ రోల్స్ పబ్లికేషన్ జరుగుతుందని, ఆ రోజు నుండి నవంబర్ 28 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని డి.ఆర్.ఓ తెలిపారు. ఈ నెల రోజుల్లో ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు చేపట్టడం జరుగుతుందని, ఫారం 6, ఫారం 7, ఫారం 8 ల ద్వారా ఆన్లైన్ లో గానీ, నేరుగా పోలింగ్ స్టేషన్ వద్ద గానీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను డిసెంబర్ 12 లోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. తుది ఓటర్ల జాబితా ను జనవరి 6 వ తేదీన ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం డి.ఆర్.ఓ అయన ఛాంబర్ లో పొలిటికల్ పార్టీ ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి లో నవంబర్ 9, 10 , 23 , 24 తేదీలల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్పెషల్ కాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందని, బి.ఎల్.ఓ లు బూత్ వద్దనే ఉందడి క్లెయిమ్ లను, అభ్యంతరాలను స్వీకరిస్తారని తెలిపారు. అయితే రాజకీయ పక్షాల వారు బి.ఎల్.ఏ లను నియమించుకుంటే స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ను రూపొందించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సందేహాల కోసం ఓటర్స్ హెల్ప్ లైన్ 1950 నెంబర్ కు కాల్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ సమావేశం లో టి.డి.పి నుండి ఐ.వి.పి రాజు, వై.సి.పి నుండి నరసింహ మూర్తి, కాంగ్రెస్ నుండి సతీష్ కుమార్, బి.జి.పి నుండి అప్పా రావు, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కర రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం చట్టాన్ని ఉల్లంఘిస్తున్న కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - బొబ్బిలి : కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఉపాధి హామి పథకం 2005 చట్టాన్ని కూటమి ప్రభుత్వం ఉల్లఘించడం సరికాదని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు అన్నారు. విలేకరులతో మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయగామీణ ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం ఉపాధి హామీ పనులు అన్నీ కూడా గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో జరగాలని చట్టం చెబుతుండగా కూటమి ప్రభుత్వం మాత్రం దానికి విరుద్ధంగా వెండర్ ద్వారా పనులు చేపట్టే విధానం అమలు చెయ్యడం సరికాదు అన్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధం, చట్టాన్ని ఉల్లంఘించడమే అని అన్నారు. ఉపాధి హామీ పనులు చేపట్టే వెండర్ అంటే కాంట్రాక్టర్ తనకు ఎలాంటి లాభా పేక్ష లేకుండా పనులు చేసే అవకాశం ఉండదు. అలాగే అధికార పార్టీ నాయకులు గాని వారి అనుచరులు గాని ఈ వెండర్ అవతారం ఎత్తి ఆ పనులు దక్కించుకునే అవకాశం పుష్కలంగా ఉంది. దీని వలన ప్రజలలో చాలా అనుమానాలు కలుగుతున్నాయి. ఉపాధి హామీ పథకం చట్టం 2005 ప్రకారం ప్రతి పంచాయతీలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకున్న సర్పంచ్ ఆధ్వర్యంలో ఆ గ్రామ అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా పంచాయతీల ద్వారా నగదు చెల్లింపులు చెయ్యడం అనేది ఇప్పటి వరకూ జరుగుతున్న ఆనవాయితీ. దీనిని కాదని నేడు కూటమి నాయకులు చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్నారని అన్నారు. ఆగష్టు 14 వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి రికార్డు సృష్టించాం అని గొప్పగా చెప్పారు. అదే ఉపాధి పనులలో సర్పంచుల హక్కులు కాలరాస్తూ సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చెయ్యడం ఎంత వరకూ సమంజసం ...? దామోదర రావు ప్రశ్నించారు. ఇకనైనా చట్ట ప్రకారం ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేసారు.

30న వయోవృద్ధుల అంతర్జాతీయ దినోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : సీనియర్ సిటిజన్లు సమాజానికి అందిస్తున్న అమూల్యమైన సేవలకు గుర్తిస్తూ, వారిని గౌరవిస్తూ, వారి పట్ల శ్రద్ధ వహిస్తూ అక్టోబరు నెలను వృద్ధుల కోసం అంతర్జాతీయ మాసోత్సవం నిర్వహించాలని రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు జి.వి.బి.జగదీష్ తెలిపారు. దీనిలో భాగంగా అక్టోబరు 30న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాయుడుపేట పాఠశాల సందర్శన

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని వీలుపర్తీ పంచాయతీ శివారు రాయుడు పేటలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి - 2 పి.బాల భాస్కర రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, పాఠశాల ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ మొదలగునివి పరిశీలించారు. తరగతి గది చక్కని టిఎల్ఎంతో గోడపత్రికలతో ఆకర్షణీయంగా ఉండడం, పాత గోడ చార్టులు తీసివేసి వాటి స్థానంలో కొత్త గోడ చార్టులు తయారు చేసి వేలాడదీయాలని చూసించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ లెక్కలు చతుర్విధ ప్రక్రియలు పరిశీలించారు. వర్క్ బుక్స్ చూసి, విద్యార్థులు తయారు చేసినటువంటి టిఎల్ఎం ను పరిశీలించారు. టిఎల్ఎం ను చాలా చక్కగా తయారు చేశారని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పి.వెంకటరమణచే మ్యాథ్స్, తెలుగు సబ్జెక్టుల మోడల్ లెస్సన్ చెప్పించారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన అన్ని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం పిల్లలతో కలిసి భోజనం చేసి సంతృప్తం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - బొబ్బిలి : తాండ్ర పాపారాయుడు విగ్రహం కూడలి ప్రాంతంలో విద్యుత్ లోడ్ సమస్య ఉన్నందున ఒక కొత్త విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలుపగా, ఆ ప్రాంతాన్ని కూటమి ఎమ్మెల్యే బేబీ నాయన సందర్శించి విగ్రహం ఉన్న స్థలానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.. మరియు అక్కడ ఉన్న చెత్తబుట్టలను కూడా వేరేచోటకు తరలించి ఆ ప్రాంత సుందరీకరణకు కావలసిన ఏర్పాట్లు చేయవలసినదిగా మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ని ఆదేశించారు. ప్రభుత్వ లైబ్రరీ నిర్మాణాన్ని సందర్శించి, లైబ్రరీ కి వచ్చేవారికోసం వాష్ రూమ్ ను మరియు లైబ్రరీకి గేటును ఏర్పాటుచేసి ఒక వారం రోజులలో అందుబాటులోకి వచ్చేలాలి చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే బేబీనాయన తమ సొంత నిధులతో జూన్ 24, 2022న మొదలుపెట్టిన అన్న క్యాంటీన్ ను సెప్టెంబర్ 13, 2024 వరకు నిర్వహించినందుకు బొబ్బిలి కోటలో శ్రీ బేబీనాయన కి అభినందన జ్ఞాపికనుసమాజ సేవకులు శ్రీ లంక వాసు అందించారు.

నవభారత్ సాక్షరత కార్యక్రమం విజయవంతానికి కలసి పనిచేయాలి

- ఎంపీడీఓలు, ఏపీఎంలకు జిల్లా కలెక్టర్ డా.అంబేద్కర్ పిలుపు

- పోస్టర్లు, శిక్షణ పుస్తకాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లా అభివృద్ధి సాధనలో ప్రధాన అడ్డంకిగా వున్న నిరక్షరాస్యతను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నవభారత్ సాక్షరత కార్యక్రమం గొప్ప అవకాశమని, దీనిని విజయవంతం చేసేందుకు మండలస్థాయిలో అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని నిరక్షరాస్యులైన 48,578 మంది స్వయంశక్తి మహిళలను అక్షరాస్యులుగా రూపొందించి జిల్లాను వచ్చే ఆరు నెలల కాలంలో సంపూర్ణ అక్షరాస్యత దిశగా నడిపించాలన్నారు. నవభారత్ సాక్షరత కార్యక్రమంపై వయోజన విద్యాశాఖ రూపొందించిన పోస్టర్లను, శిక్షణకు ఉద్దేశించిన పుస్తకాలను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యీ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఎంపిడిఓలు వ్యక్తిగతంగా శ్రద్ధ చూపించాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ ప్రాజెక్టు డైరక్టర్ ఏ.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ నిరక్షరాస్యత అనే సామాజిక రుగ్మతను తొలగించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపిడిఓలు, వెలుగు ఏపిఎంలను కోరారు. స్వయంశక్తి సంఘాల్లో విద్యావంతులైన మహిళలను గుర్తించి వారి ద్వారా ఒక్కో మహిళ మరో పది మందికి చదువు నేర్పేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మండల స్థాయిలో ఎంపిడిఓ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే కమిటీలో ఏపిఎం, సిడిపిఓ తదితరులు సభ్యులుగా వుంటారని చెప్పారు. జిల్లాలో నిరక్షరాస్యులను వారికి శిక్షణ ఇచ్చే వారిని గుర్తించామన్నారు. వయోజనవిద్య శాఖ ఉప సంచాలకులు ఏ.సోమేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు 2024 నుంచి 2027 వరకు నవభారత్ సాక్షరత కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ఐదు నెలల పాటు ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన స్వయంశక్తి మహిళలు, మధ్యాహ్న భోజన పథకం వంటపనివారు, ఆయాలు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్‌లు, అంగన్‌వాడీ హెల్పర్లు, పారిశుద్ధ్య కార్మికులను అక్షరాస్యులుగా రూపొందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వీరందరికీ ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యతలపై అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో రెండు గంటల సమయాన్ని నిరక్షరాస్యులకు చదువు చెప్పేందుకు వలంటీర్లు కేటాయించాల్సి వుంటుందన్నారు. శిక్షణకు అవసరమైన పుస్తకాలు, బోధన సామాగ్రిని అందజేస్తామన్నారు. జిల్లాపరిషత్ సి.ఇ.ఓ. సత్యనారాయణ మాట్లడుతూ జిల్లా అభివృద్ధిలో అక్షరాస్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు. వయోజనుల్లో విద్య పట్ల ఆసక్తి కలిగించడం ముఖ్యమని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, జిల్లాపరిషత్ డిప్యూటీ సి.ఇ.ఓ. వెంకటరామన్, మహిళాశిశు సంక్షేమశాఖ పి.డి. శాంతకుమారి, డి.పి.ఆర్.ఓ. డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంపై మహిళలకు అవగాహన కల్పించండి

మహిళా పోలీసులకు సిఎస్‌డిటి ఎన్‌వివిఎస్ మూర్తి

విశాలాంధ్ర - జామి : గ్రామాల్లో రేషణ్ బియ్యం అమ్మకాలు, కొనుగోలు సాగుతున్నాయని, ఇటువంటివి నేరమని, ఎవరైనా, అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడమే కాకుండా వారి రేషన్‌కార్డులను రద్దు చేయడం జరుగుతుందని సిఎస్‌డిటి ఎన్‌వివిఎస్ మూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా రేషన్ బియ్యంలో విటమిన్‌బి12, ఫ్లోరిక్ ఆమ్లం, ఐరన్ ఉండడం వలన రక్తహీనత రాకుండా చేస్తుందన్నారు. పిల్లలకు ఈబియ్యం చాలామంచిదన్నారు. మహిళా పోలీసులు గ్రామాలలో మహిళలకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం-2 పథకంగురించి వివరించారు. ఎక్కడైనా రేషన్ బియ్యం నిల్వలు ఉన్నా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈసందర్భంగా దీపం-2 పథకంకు ఎవరు అర్హులో వివరించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌వోలకు, విఆర్‌ఎలకు రేషన్ బియ్యం సరఫరా, దీపం పథకాలపై అవగాహన కల్పించారు.

రతన్ టాటా గొప్ప మానవతావాది : ఎస్విఎన్ గ్రూప్ సంస్థల అధినేత శివకుమార్

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : క్లిష్ట సమయాల్లో దేశానికి ఎనలేని సేవలు అందించిన భరతమాత ముద్దుబిడ్డ, పద్మవిభూషన్ రతన్ టాటా గొప్ప మానవతావాది అని, ఆయన జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎస్విఎన్ గ్రూప్ సంస్థల అధినేత శివకుమార్ అన్నారు. రతన్ టాటా జ్ఞాపకార్థం గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్విఎన్ లేక్ పేలస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శివకుమార్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తగా ఎంతో కీర్తి, ప్రతిష్టలు సంపాదించిన రతన్ టాటా మానవతావాదిగా అంతకు మించిన ఖ్యాతి సంపాదించారని కొనియాడారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతమని, ఆయన వ్యాపార దక్షత నేటి తరంకు స్ఫూర్తి అని అన్నారు. శిబిరంలో మొదటి రక్తదాత డాక్టర్. పి.ఎస్.వి.రామారావు 25వ సారి రక్తదానం చేయడం. యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడాన్ని అయన అభినందించారు. అనంతరం రక్తదాతలకు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్. ఎం.వి.ఎస్. వెంకటరావు, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు అబ్దుల్ రవుఫ్, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఉపాధ్యక్షులు కె.దయానంద్ లతో కలిసి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, రక్తనిధి కౌన్సిలర్ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్య భారతి 311వ సభ

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరం చైతన్య భారతి 311 వ సభ స్థానిక లైన్స్ ట్రస్ట్ భవనంలో రాంజీ రాజు అధ్యక్షతన సోమవారం జరిగింది ఈ సభలో శ్రీకృష్ణ తత్వం మీద విశ్రాంత తెలుగు పండితులు శ్రీ బల్లమూడి శంకర్రావు ప్రధాన వ్యక్తగా మాట్లాడుతూ పురుషోత్తముడైన శ్రీకృష్ణుని వ్యక్తిత్వం భారతీయ ధార్మిక జీవనంపై చూపిన ప్రభావం విశిష్టమైనదని అన్నారు రాజకీయ దురంధరుడై నిరంతర ఉత్తమ పురుషునిగా జగద్గురువుగా శ్రీకృష్ణుడు 125 సంవత్సరాలు జీవించారన్నారు. తన జీవితాన్ని తన బోధనలను లోకానికి అందించి అవతార ప్రయోజనాన్ని అందించాడన్నారు. భారత యుద్ధంలో ధర్మానికి విజయం కలగడానికి కీలక పాత్ర పోషించాడు అన్నారు అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత మండల అభివృద్ధి అధికారి పిఎస్ శ్రీనివాసరావు శ్రీకృష్ణుని తత్వం అన్ని కాలాలకు మానవ జీవితానికి మార్గదర్శకమని కొనియాడారు. ఈ కార్యక్రమం చైతన్య భారతి ప్రధాన కార్యదర్శి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు డాక్టర్ బొంతల కోటి శంకర్రావు నిర్వహణలో జరిగిన ఈ సభలో విశిష్ట అతిథిగా డాక్టర్ వి కృష్ణారావు లక్ష్మణరావు గంరెడ్డి అప్పలనాయుడు విశ్రాంత డివైఈవో ఆర్ వి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రధాన కర్తను ఉచిత రాతిన సత్కరించి అభినందించారు.

అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థినిలు

విశాలాంధ్ర - వేపాడ : మండల కేంద్రం వేపాడ గ్రామ శివారు బక్కునాయుడుపేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినిలు అండర్ - 19 రాష్ట్ర స్థాయి క్రీడల్లో తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపల్ యు ఉషారాణి తెలిపారు. అండర్ -19 రాష్ట్ర స్థాయి క్రీడల్లో బి.రేవతి 1500 మీటర్ల పరుగు పందెంలో అలాగే కీర్తి 4 కిలోమీటర్ల రన్నింగ్ పోటీలలో తనుశ్రీ హ్యాండ్ బాల్ పోటీల్లో 400 మీటర్లు విభాగంలో విజయం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అదేవిధంగా జావోలిన్ త్రో రాష్ట్రస్థాయిలో జి.శిరీష మూడవ స్థానాన్ని కైవసం చేసుకుందని, సి.హెచ్ కీర్తి రేస్ వాక్ లో 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, పి.ఈ.టి అరుణ కుమారి, పి.డి సంతోషి కుమారి తదితర పాఠశాల సిబ్బంది విద్యార్థినిలు అభినందించారు.

లైంగిక దాడికి పాల్పడిన దోషికి కఠిన శిక్ష విధించాలి

డిమాండ్ చేసిన మండల మాలమహానాడు నేతలు

విశాలాంధ్ర - వేపాడ : అభం శుభం తెలియని మూడున్నరేళ్ళ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన దోషిని కఠినంగా శిక్షించాలని మండల మాల మహానాడు నేతలు దేబార్కి కిరణ్, బోర అప్పారావు, దేబార్కి రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రం వేపాడ ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా జిల్లాలోని గంట్యాడ మండలంలో జరిగిన ఈ దుర్ఘటన మరో చోట జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తప్పు చేస్తే భయం పుట్టేలా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు జరిగేటప్పుడు బాధితులకు సానుభూతి తెలపడం కాకుండా ప్రభుత్వం బాధిత కుటుంబానికి తగు నష్టపరిహారం చెల్లించాలని దళిత సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసేందుకు నిందితుడి తరుపున న్యాయవాదులు వకాల్తా పుచ్చుకోకుండా మానవతావాదులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా ఆడపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని దళిత సంఘాల నేతలు సుచించారు.

బాడాంలో రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర - మెరకముడిదాం : మండలంలో బాడాంలో భూ సమస్యల పరిష్కారానికి మంగళవారం నాడు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గతంలో రీసర్వే చేసినప్పుడు కొన్ని సమస్యలు వచ్చినట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. గ్రామాల్లో రైతులు ఇబ్బందులు వివాదాల పడకుండా సమస్యల పరిష్కాలనే ఆశయాలతో ఉన్నత అధికారాల ఆదేశాల మేరకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తామని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ అజు రవి జాన్ రైతులకు 45రోజులల్లో పరిస్కారం జరుపుతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి : సీఐ జి.శంకర్రావు

విశాలాంధ్ర - చీపురుపల్లి : బాణాసంచాలు అమ్మకాలు జరిపే దుకాణదారులు ప్రతి ఒక్కరూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శంకర్రావు అన్నారు. మంగళవారం నాడు చీపురుపల్లి గరివిడి పట్టణాల మధ్య బాణాసంచా సామాగ్రి అమ్మకాలు జరుపుట కొరకు ఏర్పాటు చేసిన దుకాణాలను సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శంకర్రావు తోపాటు ఎస్సై ఎల్.దామోదర్ రావు సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణదారులందరూ తోను సిఐ మాట్లాడుతూ దుకాణాలకు పరిసర ప్రాంతాల్లో ఇటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. దుకాణాలకు సమీపంలో డ్రమ్ములతో నీరు ఇసుక ముందుగా ఏర్పాటు చేసుకొని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. అదేవిధంగా బాణాసంచార అక్రమ నిలువలు జరిపిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.